క్లుప్తంగా

అభివృద్ధి పనులే శ్రీరామరక్ష

పావగడ: తాలూకాలోని నిడుగల్ హోబళి పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెంకటరమణప్ప బుధవారం భూమి పూజలు నిర్వహించారు. కదిరేహళ్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా తన హయాంలో చేసిన అభివృద్ధి పనులే వచ్చే విధాన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు శ్రీరామ రక్ష అన్నారు. న్యాయదకుంటెలో రూ.25 లక్షల కోడిగెహళ్లి – కదిరేహళ్లి రోడ్డు పనులు, ముద్దగానహళ్లి–క్యాతగానహళ్లి రోడ్డు పనులు, నూతన ప్రభుత్వ పాఠశాల తరగతి గది నిర్మాణానికి, కదిరేహళ్లి సీసీ రోడ్డు, లక్ష్మి దేవాలయం సముదాయ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే వెంకటరమణప్ప భూమి పూజ చేశారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి

పరిగి: ప్రాథమిక విద్యాభ్యాసంలో కీలకమైన పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని, అర్హతలకు ఇది తొలి మెట్టు అని ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రిన్సిపల్ మురళీధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఐ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

జాతర మహోత్సవాలు ప్రారంభం



చాముండేశ్వరిని దర్శించుకుంటున్న భక్తులు

మడకశిర: ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులో పావగడ తాలూకా కరేక్యాతనహళ్లి సమీపంలో వెలసిన చాముండేశ్వరి (స్వారమ్మ) జాతర మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తొలి రోజు అగ్నిగుండ మహోత్సవాన్ని నిర్వహించారు. కర్ణాటక నుంచే కాకుండా వివిధ ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గురు, శుక్ర, శనివారాల్లో వరుసగా మూడు రోజుల పాటు సిడిమాను ఉత్సవం ,ఆదివారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇటుకలతో ఉపాధి

భవన రంగ నిర్మాణ రంగంలో మట్టి ఇటుకలకు డిమాండ్ పెరగడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇటుకలు తయారు చేస్తూ ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఇటుకల తయారీ ఆసరగా నిలుస్తోంది. కూలీలు, తాపీ రంగంలో పని చేసేవారితో పాటూ ట్రాక్టర్లు, జేసీబీ నిర్వాహకులకూ ఇదే ప్రధాన ఆదాయ వనరుగా మారింది.

- ఊపందుకున్న ఇంటి నిర్మాణాలు
- మట్టి ఇటుకలకు పెరిగిన డిమాండ్
- వందలాది కుటుంబాలకు జీవనాధారంగా మారిన ఇటుకల బట్టీలు



అచ్చులో వేసి ఇటుకలను తయారు చేస్తున్న కూలీలు

పరిగి: పెనుకొండ నియోజకవర్గంలో దాదాపుగా 150 దాకా ఇటుకల బట్టీలు ఉంటే పరిగి మండలంలో 70 దాకా బట్టీలు ఉన్నాయి. పల్లెలు, పట్టణాలన్న తేడా లేకుండా అన్ని చోట్లా ఇళ్ల నిర్మాణాలు ఊపందుకోవడంతో ఇటుకల బట్టీలు కూడా అంతకంతకూ పెరిగిపోతున్నాయి.

జగనన్న కాలనీలతో....

జగనన్న శాశ్వత గృహ హక్కు పథకంలో భాగంగా పరిగి మండలంలో రెండోదశ ఇళ్ల నిర్మాణ పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఇటుకల తయారీ రంగం మరింత ఊపందుకుంటోంది. దీని వల్ల రానున్న రోజుల్లో అటు తయారీ రంగంలో, ఇటు తాపీ రంగంలో కూలీలకు, బట్టీల యాజమానులకు మరింత లాభం చేకూరనుంది.

సింహభాగం 'పురం'కే...

ప్రస్తుతం పరిగి మండల కేంద్రంతో పాటూ శ్రీరంగరాజుపల్లి, పైడేటి, గొరవనహళ్లి, మోదా, ఆనందపాళ్యం, కోనాపురం, కొడిగెనహళ్లి, కాలువపల్లి, ఎం చెర్లోపల్లి తదితర గ్రామాల్లో ఇటుకల బట్టీలు భారీగా వెలుస్తున్నాయి. తయారైన ఇటుకలు చుట్టు పక్కల గ్రామాలతో పాటూ సింహభాగం హిందూపురానికి రవాణా అవుతున్నాయి. దీంతో పాటు మడకశిర, పెనుకొండ కర్ణాటక ప్రాంతాలైన ఐడీ హళ్లి, గుట్ట కొడిగెనహళ్లి, దొమ్మతమర్రి, గుమ్మగట్ట, గౌరిబిదనూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

ముందే అడ్వాన్సులు ఇచ్చి...

ఇటుకలకు డిమాండ్ పెరగడంతో ముందస్తుగా అడ్వాన్సులు ఇచ్చి ఇటుకను తీసుకెళ్తుంటారు. తయారీకి అయ్యే ఖర్చుకు రెట్టింపు లాభం గడిస్తున్నట్లు యజమానులు చెబుతున్నారు. దినానికి సరాసరిన ఒక కూలీ జంట వెయ్యి ఇటుకలకు వెయ్యి రూపాయలకు పైగానే ఆదాయం పొందుతున్నారు. ఈ లెక్కన రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఆర్జిస్తున్నారు.

వలస కూలీలే ఎక్కువ

ఇటుకల తయారీలో ఎక్కువగా ఒడిషా, బీహార్ రాష్ట్రాలకు చెందిన వారు కూలీలుగా పని చేస్తున్నారు. తమ సొంత రాష్ట్రాల్లో రోజంతా పని చేసినా రూ.200 కూడా రాకపోవడంతో అక్కడి నుంచి పరిగి మండలానికి పెద్ద ఎత్తున వలస వచ్చి పనులు చేసుకుంటున్నారు. దాదాపు 200 కుటుంబాలకు పైగా పొరుగు రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇటుకలను తయారు చేస్తున్నారు. వీరితో పాటూ స్థానికులు కూడా ఇటుకల తయారీనే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు.

పెనుకొండ నియోజకవర్గంలో ఇటుక బట్టీలు ఇలా..

ఇటుక బట్టీలు	: 150 సుమారు
వెయ్యి ఇటుకల తయారీకి అయ్యే ఖర్చు	: రూ.5 వేలు (దాదాపు)
వెయ్యి ఇటుకలకు కూలీలకు ఇచ్చే వేతనం	: రూ.1,000
వెయ్యి ఇటుకల ధర	: రూ.8,500



పరిగి ప్రాంతంలో ఓ షెడ్డులో ఆరబెట్టిన ఇటుకలు

10 నెలలు ఇక్కడే ఉంటాం



మాది ఒడిషా రాష్ట్రంలోని బలాంగేరీ జిల్లా ఉడాసింగ్ గ్రామం. మా గ్రామంలో ఉపాధి లేక నా కుటుంబంతో కలిసి ఆరేళ్లగా పరిగికి కొచ్చి ఇటుకల బట్టీలో పని చేస్తున్నాం. నేను, నా భార్య, ఇద్దరు కుమారులు పనిచేస్తాం. రోజూ దాదాపు రూ.2 వేలకు పైగా సంపాదిస్తున్నాం. ఇటుక తయారీ రంగంలో ఉన్న ఆదాయం మాకెక్కడా కనిపించలేదు.

– కుటుంబ సభ్యులతో కృష్ణ కర్షేల్

ఎప్పుడూ నష్టం చూడలేదు



దాదాపు పదిహేనేళ్లుగా ఇటుకలు వేయిస్తున్నా. ఎప్పుడూ ఈ రంగంలో నష్టం చూడలేదు. రూపాయి ఖర్చుకు అదనంగా రూపాయి లాభం ఉంటుంది. ఇప్పుడు భవన నిర్మాణాలు ఊపందుకోవడంతో మట్టి ఇటుకలకు డిమాండ్ పెరిగింది. దాదాపు 20 కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– మురళీమోహన్‌రెడ్డి, ఇటుక బట్టీ తయారీ యజమాని, పరిగి

అక్రమ మద్యం స్వాధీనం

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట గ్రామంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 10 కర్ణాటక మద్యం ప్యాకెట్లతో పాటు 15 చిన్న బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. ముత్యాలప్ప అనే వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థులందరికీ హాల్‌టికెట్లు ఇవ్వాలి

హిందూపురం టౌన్: ఫీజులతో సంబంధం లేకుండా డిగ్రీ విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సమావేశం నిర్వహించారు. పలు కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని చెబుతున్నారన్నారు. హాల్‌టికెట్లు అందక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని, ఫీజుతో సంబంధం లేకుండా విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రశేఖర్, హర్షకుమార్, బాబు, నవీన్, గణేష్, హరీష్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

గోపూజతో పుణ్యం

హిందూపురం: గోపూజతో సర్వదేవతాలకు ఆరాధించినంత పుణ్యం సిద్ధిస్తుందని కోన పీఠాధిపతులు చంద్రస్వామి, సద్గురు యోగి నారాయణ సేవాసమితి అధ్యక్షులు రవిశంకర్ తెలిపారు. బుధవారం కై వరం తాతయ్య జయంతిని పురస్కరించుకుని స్థానిక కేవీఆర్ ఫంక్షన్ హాల్‌వద్ద గోపూజ, నగర సంకీర్తన మహోత్సవాన్ని నిర్వహించారు. తాతయ్య చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగించారు. నగర సంకీర్తన సందర్భంగా గోమాతకు పూజలు చేయించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

హిందూపురం టౌన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి ఓటు వేసి మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేసి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు.

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. పొగాకు రామచంద్ర, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, సుబ్బిరెడ్డి, వెంకటనారాయణరెడ్డి , నటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని బోయపేట తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్సీ అభ్యర్థులు రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయనరసింహ, మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్‌చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీటీసీ సభ్యులు మారుతీరెడ్డి, చిక్కన్న, రామాంజి, సింగిల్ విండో డైరెక్టర్ కేటీ అశ్వర్థప్ప, ఐటీ వింగ్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం: కళాశాలలో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి

మడకశిర: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు 13, 14 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, మాజీ సర్పంచు ఎస్ఎస్ కృష్ణమూర్తి, ఎన్నికల పట్టణ ఇన్‌చార్జ్ జయరాజు, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మెజార్టీతో గెలిపించాలని వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, సచివాలయం కన్వీనర్లు ప్రసాద్, అమరీష్‌బాబులు కోరారు. బుధవారం కె.శివరం, పి.శివరం, పేలుబండ, ఎస్.రంగాపురం, కె.గొల్లహట్టి, కేకే.హట్టి, తదితర గ్రామాల్లో వారు ప్రచారం నిర్వహించారు.

రొళ్ల: మండల కేంద్రంలో సచివాలయం కన్వీనర్ నాగేంద్ర ఆధ్వర్యంలో వివిధ గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు గ్రామాల్లో తిరిగి వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మడకశిర మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, వైస్ సర్పంచ్ రవికుమార్, సీనియర్ నాయకులు నగేష్‌రంగారెడ్డి, నరసింహారెడ్డి, సీఎం ఘట్ట రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి



పెనుకొండ: మాట్లాడుతున్న న్యాయమూర్తి శంకరరావు



హిందూపురం: కేక్‌కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి



హిందూపురం: మాట్లాడుతున్న ఏడీజే శైలజ

- అన్ని రంగాల్లో రాణించాలన్న వక్తలు
- వేడుకగా మహిళా దినోత్సవం

హిందూపురం: మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా బుధవారం ఐసీడీఎస్ ఆఫీసులో సీడీపీఓ రెడ్డిరమణమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆటపోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలయేసు డిగ్రీ కళాశాలలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి ఆధ్వర్యంలో మహిళా లెక్చరర్లకు సన్మానించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఉత్తమ డాక్టర్ అవార్డు అందుతున్న ప్రభుత్వ కంటివైద్యులు అయిషా దర్జాను ముస్లీం నగరా, టిప్పు సుల్తాన్ యూనెటెట్ ఫంట్ సభ్యులు సన్మానించారు.



చౌళూరులో...

ఆకాశమే హద్దుగా మహిళలు అన్నిరంగాల్లో ప్రతిభ చాటుతూ ముందుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం చౌళూరు గ్రామంలో మహిళాదినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. మహిళలు, పిల్లలతో కలిసి కేక్ కత్తిరించి అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు.

మున్సిపల్ కార్యాలయంలో..

హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ మహిళా సాధికరతను మాటల్లో కాకుండా చేతల్లో చూపుతున్న ఏకైక ముఖ్యమంత్రి అని కొనియాడారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

లైఫ్‌వరల్డ్ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో నానెప్పనగర్ మహిళా పారిశుద్ధ్య కార్మికులతో కేక్ కట్ చేయించి సన్మానించారు.

సోమందేపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వైద్యాధికారి పిలుపునిచ్చారు. సీహెచ్‌ఓ మనోహర్‌రెడ్డి, పీహెచ్‌ఎస్ వెంకటసుబ్బమ్మ , హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర పాల్గొన్నారు.

గోరంట్ల: మహిళా దినోత్సవ వేడుకను మండల వ్యాప్తంగా బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని పలువురు వక్తలు సూచించారు.

మడకశిరరూరల్: మండలంలోని వైబీ హళ్లి, ఆర్ ఆనంతపురం, గుర్రపుకొండ తదితర గ్రామాల్లో బుధవారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. ఏటీఎల్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని జీఎస్ పాళ్యంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. వెల్ఫేర్ అసిస్టెంట్ నీలిమ, ఆర్డీటీ సెక్టర్ టీం లీడర్ సూర్యానారాయణ, సర్పంచ్ హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం పరిగి మండలంలో ఘనంగా నిర్వహించారు. కొడిగెనహళ్లి పంచాయతీ కార్యాలయం, పీహెచ్‌సీ, కేజీబీవీ తదితర చోట్ల కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి , సర్పంచ్ శ్రీరామప్ప, వైస్ సర్పంచ్ సాకమ్మ, ఎస్‌ఐ సువర్ణమ్మ, సీహెచ్‌ఓ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని పుల్లీకుంట గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆర్డీటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు గ్రామంలో ర్యాలీ చేశారు. ఆర్డీ మల్లికార్జున, సూపర్‌వైజర్ లీలావతి తదితరులు పాల్గొన్నారు. హేమావతిలో ఉన్న కోటక్ మహేంద్ర బ్యాంకులో కుంచిటి వక్కలిగ సంఘం రాష్ట్ర డైరెక్టర్ రాజేశ్వరి కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.

మడకశిర (అగళి): అగళిలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో సిబ్బంది, మహిళలు పెద్ద ఎత్తున పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

పావగడ: పట్టణంలోని హెల్ప్ సొసైటీ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కానిస్టేబుల్ పవిత్ర గౌడ, మానం శశి కిరణ్, సంధ్యా శశి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: బాలల హక్కులను పరిరక్షించాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ శంకరరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఏపీ గురుకుల ఎస్సీ పాఠశాలలో మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది. ఏజీపీ భాస్కరరెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

టింబక్ట్ కలెక్టివ్ ఆధ్వర్యంలో..

బాల్య వివాహాలు అరికడదామని టింబక్ట్ కలెక్టివ్ నేతృత్వంలోని మహాశక్తి సీఈఓ అశ్విని, అధ్యక్షురాలు లక్ష్మీదేవి పేర్కొన్నారు. పట్టణంలోని బోయగేరిలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

గుడిబండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ రాధమ్మ సూచించారు. బుధవారం మహిళా దినోత్సవాన్ని వెలుగు కార్యాలయంలో ఆదర్శ మహిళా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

హిందూపురం: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని హిందూపురం ఏడీజే శైలజ సూచించారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తూమకుంట టెక్స్‌పోర్టు కంపెనీలో జరిగిన సమావేశంలో ఏడీజేతో పాటు రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళినీ హాజరై మాట్లాడారు. మహిళలను గౌరవించడం మన ఇంటి నుంచే మొదలు కావాలని అప్పుడే కుటుంబ సభ్యులతో పాటు పిల్లలు కూడా మహిళ పట్ల గౌరవభావం ఏర్పడుతుందన్నారు. ఆడపిల్లలనే భేదభావం చూపకుండ ఉన్నత చదువులు చదివిస్తే బాలికలు, యువతులు ఉన్నతస్థానాలకు చేరుకుంటారన్నారు. ప్రస్తుతం మహిళలకు ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లు, సినిమా, సీరియళ్ల వంటి వాటిపై ఆసక్తి చూపకుండా ఆశయ సాధన కోసం కష్టపడితే కచ్చితంగా ఉన్నతస్థాయికి చేరుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది సవేరా, పరిశ్రమ ప్రొడక్షన్ మేనేజర్ అనంతగౌడ్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



పరిగి: మహిళా దినోత్సవంలో పాల్గొన్న కేజీబీవీ విద్యార్థినులు



పావగడ: ఉత్తమ మహిళలను సన్మానిస్తున్న దృశ్యం



అమరాపురం: పుల్లికుంటలో మహిళల మానవహారం

వైభవంగా దివ్యజ్యోతి దర్శనం


రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం రొళ్లకొండపై వెలసిన ఉగ్రనరసింహస్వామి ఆలయంలో వైభవంగా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గరుడేశ్వరస్వామితో పాటు ఉగ్రనరసింహస్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం కొండపైనే ప్రత్యేకంగా వంటకాలు తయారు చేసి స్వామివారి విగ్రహం ఎదుట ప్రసాదాన్ని నైవేద్యంగా ఉంచారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట పెద్ద ఎత్తున దివ్య జ్యోతిని వెలిగించి మొక్కలు చెల్లించుకున్నారు. దివ్యజ్యోతి దర్శనం కోసం కర్ణాటక రాష్ట్రంలోని శిరా, హుళియారు, తిమ్మనహళ్లి, హొసదుర్గ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిచ్చారు. స్వామివారిని కొలిచే భక్తులు రోజంతా ఉపవాస దీక్ష ఆచరించి దివ్య జ్యోతిని దర్శించుకున్న తర్వాత లక్ష్మీనరసింహస్వామి చిత్రపటం వద్ద పిండి వంటలను నైవేద్యంగా సమర్పిస్తారని, తర్వాత భక్తులకు అన్నదానం చేస్తారని స్థానికులు తెలిపారు.



రొళ్ల కొండపై వెలసిన ఉగ్రనరసింహస్వామి

నేడు గరుడోత్సవం..

రొళ్ల పట్టణంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గరుడోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గరుడోత్సవం పూజ వేడుకలకు పట్టణ వాసులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన స్వామివారిని కొలిచే భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కమిటీ సభ్యులు కోరారు.



రొళ్ల కొండపై దివ్యజ్యోతిని వెలగిస్తున్న దృశ్యం